క్లుప్తంగా

సీఎం రేవంత్‌ను కలిసిన రాంజీనాయక్

కామేపల్లి: సీఎం రేవంత్‌రెడ్డిని గరిడేపల్లి గ్రామానికి చెందిన టీపీసీసీ ఆదివాసీ కాంగ్రెస్ రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్ భట్టు రాంజీనాయక్ గురువారం హైదరాబాద్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. తనకు పార్టీలో సముచిత స్థానం కల్పించినందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతం కోసం కృషి చేస్తానని, త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం శక్తివంచన లేకుండా పని చేస్తానని భట్టు తెలిపారు.

అమరుల ఆశయ సాధనకు కృషి చేయాలి

తిరుమలాయపాలెం: అమరుల ఆశయ సాధనకు పార్టీ కార్యకర్తలు కృషి చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కొమ్ము శ్రీను అన్నారు. శుక్రవారం మండలంలోని పాపాయిగూడెం గ్రామంలో రేపాకుల వీరస్వామి సంస్మరణ కార్యక్రమంలో పాల్గొని నివాళులర్పించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. పార్టీ అభివృద్ధి కోసం వీరస్వామి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ వీరన్న, కొలిచలం స్వామి, నెర్సుల వెంకటేశ్, పాపిట్ల సత్యనారాయణ, రేపాకుల నారాయణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కామేపల్లి: మండలంలోని ముచ్చర్ల సబ్‌స్టేషన్ పరిధిలోని మద్దులపల్లి, లాల్యతండా, కెప్టెన్ బంజర గ్రామాల్లో శనివారం ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతుల కారణంగా విద్యుత్ కోత ఉంటుందని, విద్యుత్ వినియోగదారులు, రైతులు సిబ్బందికి సహకరించాలన్నారు.

మోకాళ్ల నొప్పులకు రోబోటిక్ సర్జరీ..

ఖమ్మం మామిళ్లగూడెం: రోబోటిక్ ద్వారా తక్కువ నొప్పితో మోకాళ్లకు సర్జరీ సాధ్యపడుతుందని జోమాజీగూడ యశోద ఆస్పత్రికి చెందిన కిహోల్ ఆర్థోపెడిక్ డాక్టర్ సునిల్ దాచేపల్లి అన్నారు. శుక్రవారం ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోకాళ్ల ఆపరేషన్లపై ప్రజల్లో అపోహలను తొలగించడానికి ప్రయత్నిస్తున్నామని, మొదటి రెండు స్టేజీలలో మోకాళ్ల మార్పిడి ఆపరేషన్ చాలా సక్సెస్ అయ్యాయని తెలిపారు. రోబోటిక్ సర్జరీ సులువుతో పాటు ఫిజియోథెరపీ కూడా సులువుగా ఉంటుందని ఆయన చెప్పారు.

ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణ సాధ్యం

ఖమ్మం మామిళ్లగూడెం: ఆరోగ్యాన్ని ప్రతి ఒక్కరూ కాపాడుకోవాలని, ఆరోగ్యంగా ఉంటేనే విధి నిర్వహణ సాధ్యమవుతుందని ఆర్టీసీ ఆర్ఎం సీహెచ్.వెంకన్న తెలిపారు. ఎండాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని శుక్రవారం ఖమ్మం కొత్త బస్టాండ్‌లో విధులు నిర్వహిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎండదెబ్బ తగలకుండా తగు జాగ్రత్తలు పాటించాలని సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఆర్ఎం పవిత్ర, ఖమ్మం డీఎం బి.శ్రీనివాస్, సీఐ రామిశెట్టి రామయ్య, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ప్రేమలు
వినోద	ప్రేమలు
సాయిరాం	యమధీర
ఆదిత్య	రజాకార్
శ్రీనివాస	భీమా
సుందర్	హనుమాన్

- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	20	పాలకూర	3
పచ్చిమిర్చి	30		20
కాకర	20	చుక్కకూర	3
బీర	46		20
దొండ	20	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	100	గోంగూర	2
గోరుచిక్కుడు	40		10
క్యాబేజీ	26	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	20		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	36	పుదీన	1
క్యాప్సికం	60		20

-ఖమ్మం వ్యవసాయం

సంక్షేమం.. చీకటిమయం!



అంధకారంలో ఉన్న ఎస్సీ కాంప్లెక్స్ వసతిగృహం ముందు రోడ్డు (ఇన్‌సెట్) స్తంభాలకు లైట్లు బిగించని దృశ్యం



మందుబాబులకు అడ్డాగా మారిన ప్రాంతం

ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాల చుట్టూ అంధకారం

- రోడ్ల వెంట కనిపించని వీధి దీపాలు
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన స్థలాలు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థులు, స్థానికులు
- పట్టించుకోని పాలకులు

విద్యార్థులకు సకల సౌకర్యాలతో ప్రభుత్వం సంక్షేమ వసతిగృహాలను ఏర్పాటు చేసి వసతి కల్పిస్తోంది. అయితే వసతిగృహాల్లో సౌకర్యాలు బాగున్నప్పటికీ బయట మాత్రం సమస్యలు వేధిస్తున్నాయి. వారి సంక్షేమాన్ని పట్టించుకోవడంలో అధికారులు, పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. రాత్రి వేళ వసతిగృహాల చుట్టూ నిఘా లేక, కనీసం వీధి దీపాలు లేక బయట జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు లోపల ఉన్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని పలు ప్రాంతాల్లో సంక్షేమ వసతిగృహాల చుట్టూ సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నెస్పీ క్యాంపులో ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖలకు చెందిన బాలుర, బాలికలకు సంబంధించి ప్రీ, పోస్ట్ మెట్రిక్ వసతిగృహాలతో పాటు ఎస్సీ సంక్షేమ శాఖ బాలికల గురుకులం ఉంది. ఈ ప్రాంతంలోని రోడ్లకు వీధి దీపాలు సక్రమంగా లేకపోవడంతో రాత్రి వేళ వసతిగృహాల ముందు రోడ్లు అంధకారంగా ఉంటున్నాయి. ప్రధానంగా ఎస్సీ బాలుర కాంప్లెక్స్ వసతిగృహాలకు వెళ్లే రోడ్డు రాత్రి వేళ చిమ్మ చీకటిగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతంలో రాత్రి అయితే మందుబాబులు చేరి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు.

ఏళ్లుగా లేని వీధి దీపాలు..

ఒక పక్క కొత్త బస్టాండ్, కమ్యూనిస్టు పార్టీ కార్యాలయం, మరో పక్క కొత్త మున్సిపాలిటీ కార్యాలయం చుట్టూ ప్రభుత్వ, ప్రజా, పార్టీల కార్యాలయాలు, ప్రాంగణాలు ఉన్నాయి. అయినా ఎన్నెస్పీ క్యాంపులోని ఎస్సీ బాలుర కాంప్లెక్స్ వసతిగృహాలు ఉన్న వీధికి మాత్రం పాలకులు, అధికారులు వీధి దీపాలు ఏర్పాటు చేయడం మరిచారు. వసతిగృహానికి ముందు విద్యుత్ స్తంభాలు ఉన్నప్పటికీ వాటికి వీధి దీపాలు ఏర్పాటు చేసేలా అధికారులు చర్యలు చేపట్టలేదు. ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంతంలో వీధి దీపాలను ఏర్పాటు చేయాలని వసతిగృహ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నా పాలకులు పట్టించుకోలేదు. ఓటర్లు కాదనే ఉద్దేశంతోనే విద్యార్థులు ఉండే వసతిగృహాల చుట్టూ వీధి దీపాలు ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని విద్యార్థి సంఘాల నేతలు ఆరోపిస్తున్నారు.

చీకటి పడితే మందు బాబుల సందడి..

ఎన్నెస్పీ క్యాంపులో ఖాళీ స్థలాలు ఎక్కువగా ఉండడం, వీధి దీపాలు పూర్తి స్థాయిలో ఉండకపోవడంతో ఈ ప్రాంతం మందుబాబులకు అడ్డాగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. ఎస్సీ బాలుర కాంప్లెక్స్ వసతిగృహం నుంచి నిర్మల్‌హృదయ్ పాఠశాల వైపు వెళ్లే రోడ్డులో వీధి దీపాలు లేకపోవడంతో వసతిగృహ గోడకు ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాన్ని మందుబాబులు అడ్డాగా చేసుకున్నారు. చీకటి పడితే చాలు మందుబాబులు మద్యం సీసాలతో అక్కడకు చేరుకొని అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. రాత్రి వేళ అనేక మంది ఆ ప్రాంతానికి వచ్చి మద్యం తాగి వెళ్తుండడంతో వసతిగృహ విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందని సిబ్బంది వాపోతున్నారు. ఇటీవల కాలంలో కొంతమంది వ్యక్తులు ఈ ప్రాంతంలో గొడవ కూడా చేశారని, వీధి దీపాలు లేకపోవడంతో ఎవరున్నారనేది కూడా కనిపించడం లేదని చెబుతున్నారు.

అధికారులు దృష్టి సారించాలి..



ప్రభుత్వ వసతిగృహాలు, గురుకులం ఉన్న ఎన్నెస్పీ క్యాంపులో నిఘా లేకపోవడంతో అసాంఘిక కార్యకలాపాలు పెరిగిపోతున్నాయి. వసతిగృహాల చుట్టూ ఉన్న రోడ్ల వెంట వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో మందుబాబులు ఈ ప్రాంతాన్ని అడ్డాగా చేసుకొని మద్యం సేవిస్తున్నారు. రాత్రి వేళ ఈ ప్రాంతంలో వారి అలజడితో వసతిగృహ విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే వీటిపై దృష్టి సారించాలి.

– టి.ప్రవీణ్, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఎస్ఎఫ్ఐ

వీధి దీపాలు ఏర్పాటు చేయాలి..



వీధి దీపాలు లేకపోవడంతో చికటి పడితే ఈ ప్రాంతం అంతా అంధకారంలో ఉంటుంది. లైట్లు లేకపోవడంతో రాత్రి వేళ అనేక మంది వసతిగృహం పక్కన ఖాళీ స్థలాల వద్దకు వచ్చి మద్యం తాగి వెళ్తున్నారు. ఇటీవల కాలంలో వీరి ఆగడాలు పెరిగిపోయ్యాయి. వీధి దీపాలు ఏర్పాటు చేస్తే సౌకర్యంగా ఉండడంతో పాటు మందుబాబులు ఈ ప్రాంతానికి వచ్చే అవకాశం ఉండదు. అధికారులు స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయాలి.

– మాన్‌సింగ్, వాచ్‌మెన్, ఎస్సీ బాలుర బి వసతిగృహం

ముగిసిన కల్యాణ మహోత్సవ జాతర



పూజలో పాల్గొన్న భక్తులు

కామేపల్లి: మండలంలోని పండితాపురం గ్రామంలో గల శ్రీ రామలింగేశ్వరస్వామి కల్యాణ మహోత్సవ జాతర వేడుకలు నాలుగు రోజులపాటు అత్యంత వైభవంగా జరిగాయి. చివరి రోజైన శుక్రవారం పూర్ణాహుతి కార్యక్రమంతో ముగియగా.. వేదపండితులు గణపతిబొట్ల మధుసూదనశర్మ ఆధ్వర్యాన ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. భక్తులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు.అనంతరం దాతలను ఉత్సవ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబు యాదవ్, బానోత్ నరసింహానాయక్, మేకపోతుల మహేశ్‌గౌడ్, బోడేపూడి విఠల్‌రావు, మేకల మల్లికార్జున్‌రావు, బండి ఎల్లయ్య, చల్లా మల్లయ్య, జక్కంపూడి వెంకటేశ్వర్లు, ధరావత్ హరిశ్చందర్, జలగం శ్రీను తదితరులు పాల్గొన్నారు.

200 రోజుల పని దినాలు కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్వర్లు

ఖమ్మంమయూరిసెంటర్: గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం కింద కూలీలకు కల్పిస్తున్న పనిదినాల సంఖ్య 200 రోజులకు పెంచాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో సంఘ జిల్లా అధ్యక్షుడు ఆర్.శివలింగం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కూలీలు పనులు కల్పించాలని కోరుతున్నా.. అధికారయంత్రాంగం పనులు చూపించలేకపోతుందన్నారు. రోజుకు కూలికి వేతనంగా రూ.600లు చెల్లించాలని, కొలతలతో పనిలేకుండా వేతనాలు చెల్లించాలని, పని ప్రదేశంలో నీడ సౌకర్యం, మంచినీటి వసతి, మెడికల్ కిట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర నాయకులు బందెల వెంకయ్య, జిల్లా నాయకులు కంకణాల అర్జున్ రావు, బీరెల్లి లాజర్, ఆవుల మంగతాయి, తిమ్మిడి హనుమంతరావు, వీర్ల వెంకటఅప్పారావు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, కూరాకుల నరసయ్య, చల్ల రాజు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న సీడీపీఓ దయామణి

కామేపల్లి: గర్భిణులు, బాలింతలు రక్తహీనత లేకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ దయామణి అన్నారు. పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గోవింద్రాల బంజర-2 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షం కార్యక్రమాన్ని నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రంలో అందిస్తున్న కోడి గుడ్డు, పాలను ప్రతీ రోజు తీసుకోవాలని, శిశువు పుట్టగానే ముర్రుపాలు పట్టిస్తే పోషకాలు అందుతాయన్నారు. తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని, చిరుధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలన్నారు. ఐదేళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, గర్భిణులు, బాలింతలు, చిన్నారులు పాల్గొన్నారు.

ఇజ్రాయిల్ దాడులు ఆపాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న దాడులను వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు మహమ్మద్ సలాం డిమాండ్ చేశారు. శుక్రవారం నగరంలో వాహిదియా మస్జీద్ ఆధ్వర్యాన పాలస్తీనాపై జరుగుతున్న దాడులకు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పథకం ప్రకారం పాలస్తీనాను ఆక్రమించుకునేందుకు దాడులు చేస్తున్నారని, ఈ దాడులను ప్రపంచ దేశాలు ఖండిస్తున్నా.. కొన్ని దేశాలు ఇజ్రాయిల్‌తో దాడులు చేయిస్తున్నాయని ఆరోపించారు. తక్షణమే ఈ దాడులను నిలుపుదల చేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవాజ్ జిల్లా కార్యదర్శి ఎస్‌కె.గౌస్, ఎండీ రెహమాన్, ఎస్‌డీ అశ్రఫ్, ఎస్‌డీ ఫసి, ఎంఏ అజీజ్, యూనిస్ తదితరులు పాల్గొన్నారు.

సామూహిక సీమంతాలు, అన్నప్రాసన



గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

తిరుమలాయపాలెం: మండలంలోని పిండిప్రోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ పోషణ పక్షోత్సవ కార్యక్రమాలను శుక్రవారం సుబ్లేడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ వసుంధర జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అంతేకాక ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా నీటిని పొదుపుగా వాడుకుని ప్రతీ నీటి బొట్టును కాపాడుకోవాలని సీడీపీఓ బాలత్రిపుర సుందరి అన్నారు. గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారంపై ఏసీడీపీఓ ఉదయశ్రీ వివరించారు. ఈనేపథ్యాన తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు ఉన్న ఆహార పదార్థాలతో ఫుడ్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, పిల్లలకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూసుమంచి, తిరుమలాయపాలెం, నేలకొండపల్లి మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

కామేపల్లి పీఏసీఎస్ వైస్ చైర్మన్‌గా రాంబాబు

కామేపల్లి: కామేపల్లి ప్రాథమిక సహకార సంఘం (పీఏసీఎస్) వైస్ చైర్మన్‌గా పింజరమడుగు గ్రామానికి చెందిన గుజ్జర్లపూడి రాంబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్థానిక సహకార సంఘం కార్యాలయంలో ఎన్నికల అధికారి రవికుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి 11 మంది డైరెక్టర్లు హాజరై వైస్ చైర్మన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చైర్మన్ స్థానం కూడా ఖాళీగా ఉండడంతో తాత్కాలిక చైర్మన్ బాధ్యతలను కూడా రాంబాబుకు అప్పగించారు. వైస్ చైర్మన్‌ను పలువురు ప్రజాప్రతినిధులు,కాంగ్రెస్ నాయకులు అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు పుచ్చకాయల వీరభద్రం, ములకలపల్లి కరుణ, దేవండ్ల యాదగిరి, సకినాల పద్మ, దొంగల వెంకటనర్సమ్మ, తుమ్మలపల్లి వీరయ్య, హట్కర్ లక్ష్మి, పింగిలి నాగభూషణం, భూక్యా జేత్రాం, సీఈఓ గాదె నాగయ్య, ఎంపీటీసీ నల్లమోతు లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

ఖమ్మంరూరల్: రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంతో ఖమ్మం పార్లమెంట్ స్వతంత్ర ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు సిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అందరి ఇంటి బిడ్డగా వస్తున్న తనను ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలన్నారు.

శాఖమూరి రమేశ్‌పై రౌడీ షీట్ ఎత్తివేత



మాట్లాడుతున్న శాఖమూరి రమేశ్

నేలకొండపల్లి: మండలంలోని గువ్వలగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు, స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శాఖమూరి రమేశ్‌పై పెట్టిన రౌడీషీట్‌ను రద్దు చేస్తూ హైకోర్టు తీర్పు ఇచ్చింది. గత ప్రభుత్వ హయాంలో రమేశ్‌పై రౌడీ షీట్‌ను పోలీసులు ఓపెన్ చేయగా.. హైకోర్టు అది అక్రమమని, వెంటనే రౌడీ షీట్‌ను తొలిగించాలని ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఈమేరకు మండల కేంద్రంలో రమేశ్ విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గత పాలకులు అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఎన్నో అరాచకాలు, అక్రమ కేసులు పెట్టించారని.. నేడు హైకోర్టు ఇచ్చిన తీర్పు వారికి చెంప పెట్టు లాంటిదన్నారు. ఎప్పటికైనా న్యాయం గెలుస్తుందని అన్నారు.


హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా సీతయ్య



సీతయ్యను సన్మానిస్తున్న దృశ్యం

కామేపల్లి: తెలంగాణ హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షుడిగా ముచ్చర్ల గ్రామానికి చెందిన రాయల సీతయ్య నియమితులయ్యారు. ఆ సంఘం నేషనల్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉన్నం జ్ఞానసుందరి నియమించినట్లు శుక్రవారం ఆయన విలేకరులకు తెలిపాక ఆయన మాట్లాడారు. ఎవరికైనా అన్యాయం, వివక్షత, అణచివేతకు గురైతే తమను సంప్రదించాలని, వారి పక్షాన నిలిచి అండగా నిలుస్తామన్నారు. తనపై నమ్మకంతో తనను రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం సీతయ్యను చైర్‌పర్సన్ ఘనంగా సన్మానించారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



ఆవుకి టీకా వేస్తున్న వైద్యురాలు అరుణ

ఖమ్మంరూరల్: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు తక్షణమే టీకా వేయించాలని జిల్లా పశు వ్యాధి నిర్ధారణ కేంద్రం సహాయ సంచాలకురాలు డాక్టర్ అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని పెదతండాలో పశువుల నుంచి రక్తనామూనాలు సేకరించి పశువులకు టీకా వేసిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ప్రస్తుత సీజన్‌లో పశువులకు గాలికుంటు వ్యాధి, ఇతర కాల వ్యాధులు వస్తున్న నేపథ్యాన ఈ టీకాలు వేస్తున్నామని, ప్రతీ ఒక్క రైతులు పశువులకు టీకాలు వేయించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టలు భరీశ్, అమర్‌లతో పాటు శిరీష, రవికుమార్, ఖాజా, పాషా, వెంకటేశ్వర్లు, రామయ్య,తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా 'శ్రీ చైతన్య' వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్‌లో గల శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. అబ్దుల్ కలాం స్ఫూర్తితో తమ భవిష్యత్‌కు బంగారు బాటలు చేసుకొని ఉన్నత ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. కళాశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్, మాట్లాడుతూ ఈ పోటీ ప్రపంచంలో విద్యార్థులకు అవసరమైన శిక్షణ ఇస్తూ.. నాణ్యమైన విద్యను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ శ్రీవిద్య, ప్రముఖ గాయకుడు రామ్ మిర్యాల, ప్రిన్సిపాల్ డాక్టర్ పన్నాల కృష్ణమూర్తి, సీఈఓ పుట్టా శ్రీనివాస్, డీజీఎం యేతస్, బ్రహ్మం, ప్రకాశ్, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

ఖమ్మం సహకారనగర్: ఎడ్వేడా కంపెనీ నిర్వహించిన ప్లేస్‌మెంట్స్‌లో తమ కళాశాల విద్యార్థులు 59 మందికి ఉద్యోగాలు సాధించానట్లు ఎస్‌బీఐటీ కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులను అభినందించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఐసీటీ అకాడమీ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ డ్రైవ్‌లో విద్యార్థులు ఈ ఘనత సాధించనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకాడమిక్ డైరెక్టర్లు శ్రీనివాసరావు, శివప్రసాద్, జి.ప్రవీణ్, రవీంద్రబాబు, శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, కంపెనీ బాధ్యులు రాజేశ్వరీ, రామ్‌కుమార్, అక్షయ, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

కేజ్రీవాల్ అరెస్ట్ అప్రజాస్వామికం..



ఖమ్మంవన్‌టౌన్: మోదీ చిత్రపటాన్ని దహనం చేస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్/నేలకొండపల్లి: ప్రశ్నిస్తే కేసులు పెడుతూ, ఈడీ, మోడీలు ఒక్కటై రాజ్యాంగం అందించిన ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నారని అఖిల పక్ష పార్టీల నాయకులు అన్నారు. శుక్రవారం నగరంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవరెడ్డిభవన్‌లో ఇండియా కూటమి పార్టీలైన కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ, సీపీఎం, సీపీఐ, సీపీఐఎంఎల్ (మాస్‌లైన్), ప్రజాపంథా పార్టీల ఆధ్వర్యాన ఆమ్ ఆద్మీ జిల్లా అధ్యక్షుడు స్వర్ణ సుబ్బారావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్‌ల విషయంపై సుప్రీంకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసి, విస్తృత స్థాయిలో దేశవ్యాప్తంగా చర్చ నడుస్తున్న సమయాన ఆ విషయాన్ని పక్కదారి పట్టించేందుకు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారన్నారు. ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నా.. ఈడీ అధికారులతో ప్రధాని మోదీ కుమ్మక్కై కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేశారన్నారు. కేజ్రీవాల్ అరెస్ట్‌ను ముక్త కంఠంతో వక్తలు ఖండిస్తున్నామన్నారు. అలాగే కేజ్రీవాల్ అరెస్ట్‌కు నిరసనగా నగరంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. నేలకొండపల్లిలో ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు పసుమర్తి శ్రీనివాస్ ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ మోదీ ఓటమి భయంతో ప్రజాస్వామ్య వ్యవస్థలను అడ్డంపెట్టుకుని నియంతలా వ్యవహరిస్తున్నాడని అన్నారు. అరెస్ట్‌ను నిరసిస్తూ అన్ని పార్టీలతో కలిసి నిరసన కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మహ్మద్ జావీద్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్లపల్లి సంతోశ్, ఖమ్మం అసెంబ్లీ అధ్యక్షుడు కొండూరు ఉదయ్ కిరణ్, బొల్లం మహేశ్‌యాదవ్, తోమాటి నవీన్‌రెడ్డి, పమ్మి అశోక్, మాలోత్ హుస్సేన్, మిక్కిలినేని నరేందర్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కో కన్వీనర్ నల్లమోతు తిరుమలరావులతో పాటు గోకినేపల్లి వెంకటేశ్వరరావు, సీవై పుల్లయ్య, బచ్చలికూర యూస్సీ, పొన్నం వెంకటేశ్వరరావు, మహ్మద్ ఫక్రుద్దీన్, బాచ్చాల అన్వేష్, బాలగంగాధర్, రాజీవ్‌గాంధీ తదితరులు పాల్గొన్నారు.